

ఆడుదాం ఆంధ్రా విజయవంతం

'ఆడుదాం ఆంధ్రా' జిల్లా స్థాయి పోటీలు ముగిశాయి. 9వ తేదీ నుంచి విశాఖలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి 120 మంది ఎంపికయ్యారు. 8లో



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6. సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

దివ్యాంగులకు ఉద్యోగ మేళా



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగ నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ నెల 7న ఉదయం 10.30 గంటలకు ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.కళ్యాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల యువతీ యువకులు ఆ రోజు బయోడేటా, విద్యార్హతల ఒరిజనల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులు, ఆధార్‌కార్డుతో ఉపాధి కల్పన అధికారి కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

5న ఉద్యోగ మేళా..

స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ సంస్థలో క్రెడిట్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 5న ఉదయం 10.30 గంటలకు ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి ఎ.కళ్యాణి ఓ ప్రకటనలో తెలిపారు. రూ.14 వేల వేతనం ఉంటుందని, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల పరిధిలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు ఒరిజినల్, జిరాక్స్, ఆధార్‌కార్డు తీసుకుని ఉద్యోగమేళాకు రావాలని కళ్యాణి కోరారు.

97 శాతం పింఛన్ల పంపిణీ



కొత్తచెరువులో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆంజనేయులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జోరుగా సాగుతోంది. జిల్లాలో 2,74,578 మంది లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.81.95 కోట్లు మంజూరు చేసింది. 1వ తేదీ ఇంటింటికీ తిరిగి పింఛన్ పంపిణీ చేసిన వలంటీర్లు రెండో రోజు నుంచి సుదూర ప్రాంతాల్లో ఉన్న వారి వద్దకే వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. ఫలితంగా మూడోరోజు శనివారం నాటికి జిల్లాలో 2,65,789 మందికి రూ.79,32,06,500 మొత్తాన్ని అందజేశారు. దీంతో జిల్లాలో పింఛన్ పంపిణీ 97 శాతం పూర్తయ్యింది. పింఛన్ పంపిణీకి మరో రెండు రోజుల గడువు ఉందని, ఆలోపు మిగతా వారికీ పింఛన్ కానుక అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

జేఎన్‌టీయూ (ఏ) ఆధ్వర్యంలో 'ఈసెట్'



ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తికి నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ శ్రీనివాస రావు

అనంతపురం: ఏపీ ఈసెట్ ప్రక్రియ ఈ ఏడాది జేఎన్‌టీయూ (ఏ) ఆధ్వర్యంలో సాగనుంది. గత ఏడాది, అంతకుముందు ఏడాది వర్సిటీ ఆధ్వర్యంలో ఏపీ ఈఏపీసెట్ నిర్వహించారు. తాజాగా ఏపీ ఈసెట్ అప్పగించారు. ఈఏపీసెట్ బాధ్యతను జేఎన్‌టీయూ (కే)కు కేటాయించారు. ఈసెట్ రాష్ట్ర చైర్మన్‌గా జేఎన్‌టీయూ(ఏ) వీసీ జీవీఆర్ శ్రీనివాస రావు, రాష్ట్ర కన్వీనర్‌గా ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తిని నియమితులయ్యారు. 2015 నుంచి 2021 వరకూ వరుసగా ఏడు దఫాలు జేఎన్‌టీయూ (ఏ) ఆధ్వర్యంలో ఏపీ ఈసెట్ సాగింది. 6 సార్లు కన్వీనర్‌గా భానుమూర్తి వ్యవహరించారు. తాజాగా మరో దఫా అవకాశం దక్కడంతో ఈసెట్ చరిత్రలోనే అత్యధిక సార్లు కన్వీనర్‌గా నియమితులైన ఘనత సాధించారు.

పక్షవాతం.. పారాహుషార్ !


- హిందూపురానికి చెందిన 56 ఏళ్ల వ్యక్తికి చేయి, కాలు తిమ్మిర్లు పట్టేవి. కానీ అతను పెద్దగా పట్టించుకునే వాడు కాదు. ఇటీవల 'ఫ్యామిలీ డాక్టర్' శిబిరంలో పరీక్షలు చేయించుకోగా, పక్షవాతం లక్షణాలు కనిపించడంతో వైద్యులు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడి వెళ్లి చూపించుకోగా వైద్యులు పక్షవాతం సోకినట్లు నిర్ధారించారు. సకాలంలో రావడంతో పెను ప్రమాదం తప్పినట్లు వెల్లడించారు. కానీ నిత్యం మందులు వాడాలని సూచించారు.
- అమరాపురం మండలానికి చెందిన 46 ఏళ్ల మహిళ 15 రోజుల క్రితం వ్యక్తిగత పని నిమిత్తం పుట్టపర్తికి వచ్చింది. ఉన్నఫలంగా కింద పడిపోవడంతో హుటాహుటిన శ్రీసత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు పక్షవాతంగా గుర్తించారు. అయితే అవగాహన లోపంతో చాలా ఆలస్యం జరిగిందని.. నిత్యం మందులు వాడాల్సిందేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె సొంతూరిలోనే చికిత్స పొందుతోంది.

...ఇలా జిల్లా వ్యాప్తంగా చాలా మంది పక్షవాతం బారిన పడుతున్నారు. బాధితుల్లో చాలామంది 30 ఏళ్ల లోపు వారు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మారిన ఆహార అలవాట్లు, టెన్షన్‌తో కూడిన ఉద్యోగాలు సగం చేటు చేస్తుండగా, ధూమపానం, మద్యపానం పరిస్థితి మరింత తీవ్ర తరం చేస్తున్నాయి.

- యుక్త వయసులోనే పక్షవాతం
- ఒత్తిడితో కూడిన జీవనం.. మారిన ఆహార అలవాట్లతో ప్రమాదం
- అవగాహన లోపంతో సమస్య తీవ్రం
- ఉచిత చికిత్స అందిస్తోన్న వైద్యులు

సాక్షి, పుట్టపర్తి

ఉన్నట్టుండి శరీరం బిగుసుకుపోవడం, మూతి వంకర తిరగడం, కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం, ఒక్కోసారి గుండె కూడా పని చేయకపోవడం.. ఇలా శరీరంలో ప్రతి అవయవంపై పక్షవాతం తీవ్ర ప్రభావం చూపుతోంది. అప్పటి వరకు ఆనందంగా సాగిపోతున్న వారి జీవితాలను ఆకస్మాత్తుగా కుప్ప కూల్చేస్తోంది. వారి బతుకులను అంధకారంలోకి నెట్టేస్తోంది. పక్షవాతానికి గురైన కొందరు దివ్యాంగులుగానే మిగిలిపోయి.. నానా అవస్థల మధ్య బతుకు బండి లాగుతున్నారు. ఇంకొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. అయితే ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తోన్న ఫ్యామిలీ డాక్టర్ విధానంలో చాలా మందికి ఊరట లభిస్తోంది. నిత్యం ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న కారణంగా ముందుగానే అప్రమత్తం అవుతున్నారు.



ఆహారపు అలవాట్లలో మార్పుతోనే..

మారిన ఆహారపు అలవాట్లు, రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రించుకోవడంలో నిర్లక్ష్యం, వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించకపోవడం, సరైన సమయంలో తగిన వైద్యం పొందకపోవడంతో ఎక్కువ శాతం మంది పక్షవాతం బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మద్యపానం, ధూమపానం, జీవనశైలి కూడా పక్షవాతం రావడానికి కారణంగా చెబుతున్నారు. ఊబకాయం, రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, గుండెజబ్బు లున్న వారే అధికంగా పక్షవాతానికి గురవుతున్నారు.

ముందస్తు సంకేతాలు ఇవే..

పక్షవాతాన్ని ఆంగ్లంలో పెరాలసిస్, వైద్య పరిభాషలో బ్రెయిన్ స్ట్రోక్ అని పిలుస్తారు. మెదడుకు రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడినప్పుడు కొన్ని లక్షణాలు బయటపడతాయి. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారికి మెదడుకు రక్త సరఫరా తగ్గడంతో శరీరంలో తిమ్మిర్లు, ఒక కాలు, చేతిలో శక్తి తక్కువైనట్లు అనిపిస్తుంది. పూర్తిగా లేదా సరిగా మాట్లాడలేకపోతారు. ఇతరులు చెప్పింది అర్థం చేసుకోలేరు. చూపు మసకబారుతుంది. నడవలేరు. తీవ్ర తలనొప్పితో బాధపడతారు. ఈ లక్షణాలు కనిపించిన మూడు గంటల్లోపు ఆస్పత్రికి తీసుకెళ్తే రక్త ప్రసరణను పునరుద్ధరించి మెదడు ఎక్కువగా దెబ్బ తినకుండా వైద్యులు కాపాడగలుగుతారు.

అవగాహన లోపంతోనే..

దేశంలో సగటున 10 శాతం మంది పక్షవాతం బారిన పడుతున్నట్లు పలు అధ్యయనాల ద్వారా తేలింది. అయితే అవగాహన లోపంతోనే పది శాతం మంది కూడా పక్షవాతం బారిన పడుతున్నారని తెలిసింది. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వారిలో 30 శాతం మంది శాశ్వత వైకల్యం బారిన పడుతున్నారు. అదేవిధంగా మరో 25 శాతం మంది 30 ఏళ్లలోపు వారు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇక 45 ఏళ్లు దాటిన వారిలో పక్షవాతం రిస్క్ ఎక్కువగా ఉంటోంది. మహిళల్లో 55 ఏళ్లు పైబడిన వారు ఎక్కువ ప్రమాదంలో పడుతున్నారు.

జాగ్రత్తలు ఇవే..

- తరచూ బీపీ, షుగర్ పరీక్షించుకోవాలి. వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి.
- ఎక్కువ నీరసంగా ఉన్నట్లు అనిపిస్తే వెంటనే ఆస్పత్రిలో చేరాలి.
- గుండె, కిడ్నీ సమస్యలతో బాధపడే వారు వైద్య పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఒత్తిడికి దూరంగా ఉండాలి.
- ఆహారపు అలవాట్లు బాగుండాలి.
- రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

అప్రమత్తం చేస్తున్నాం



మద్యం, పొగ తాగే వారికి పక్షవాతం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే అవగాహన కలిగి ఉండి వీలైనంత తొందరగా వైద్యులను సంప్రదిస్తే పక్షవాతానికి దూరంగా ఉండవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయి. ఉచితంగా వైద్యం అందుతోంది. మధుమేహం, రక్తపోటు కారణంగా యుక్త వయసులోనే పక్షవాతం బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. అందుకే 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేయిస్తున్నాం. ముందస్తుగా అప్రమత్తం చేస్తూ చికిత్సలు అందిస్తున్నాం.

– ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్, చిత్రంలో కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కోర్టులో క్రిమినల్ కేసులకు సంబంధించి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ నిర్వహించారు. సమావేశంలో అనంతపురం కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి పాల్గొన్నారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమన్వయం చేసుకునే విధానంపై రెవెన్యూ, పోలీస్ శాఖలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలు చేశారు. పోక్సో, ఇతర కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించే అంశంపై సమావేశంలో ప్రస్తావించారు.

10న జేఎన్‌టీయూలో వర్క్‌షాప్

అనంతపురం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఈ నెల 10న వర్క్‌షాప్ ఫర్ యంగ్ అడ్వకేట్స్ పేరుతో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ముగ్గురు సుప్రీం కోర్టు జడ్జీలు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు హైకోర్టు న్యాయమూర్తులు బార్ కౌన్సిల్ చైర్మన్, సభ్యులు హాజరవుతారు. వర్క్‌షాప్‌లో పాల్గొనే వీఐపీలకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో చర్చ జరిగింది. కార్యక్రమంలో అనంతపురం మునిసిపల్ కమిషనర్ మేఘ స్వరూప్, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ శశిధర్, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేపర్లు దిద్దకపోతే పరీక్షలెందుకు?



సంజీవరాయునిపల్లిలో విద్యార్థులను మెచ్చుకుంటున్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్



సోమందేపల్లి కేజీబీవీ వద్ద సౌకర్యాలు ఆరా తీస్తున్న ప్రవీణ్ ప్రకాష్

- ఉపాధ్యాయులపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం
- పరీక్షల నాటికి కళాశాలల్లో వసతులు కల్పించాలని ఆదేశాలు

హిందూపురం టౌన్: ''ఎస్ఏ–3 పరీక్షకు సంబంధించిన పేపర్లు ఇంతవరకూ దిద్దలేదు. మరి మార్కులు ఎలా వేస్తారు. చదువులో ఫలానా విద్యార్థి వెనకబడ్డారని ఎలా గుర్తిస్తారు. వారిని ఎలా సన్నద్ధం చేస్తారు. అసలు మూల్యాంకనమే చేయనప్పుడు పరీక్షలు నిర్వహించడం ఎందుకు..?'' అని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన హిందూపురంలోని నేతాజీ మున్సిపల్ ఉన్నత, ప్రకాశం పంతులు ప్రాథమిక పాఠశాలలను, సంజీవరాయునిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చిన్నమార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలను పూర్తి చేశారా లేదా అని ఉపాధ్యాయులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ప్రకాశం పంతులు ప్రాథమిక పాఠశాలలో ఎస్ఏ–3 పరీక్ష పేపర్లను ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయనట్లు గుర్తించి ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓ, డీఈఓ పర్యవేక్షణ లోపించిందని వారిపైనా అసహనం వ్యక్తం చేశారు. సంజీవరాయునిపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి విద్యార్థులను, ఉపాధ్యాయులను మెచ్చుకున్నారు.

కళాశాలల్లో వసతులు కల్పించాలి..

అనంతరం ఆయన చిన్నమార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 'నాడు–నేడు' పనులను ఆయన పరిశీలించారు. అలాగే సిలబస్, రివిజన్ నుంచి విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ పరీక్షల నాటికి జూనియర్ కళాశాలల్లో 'నాడు–నేడు' పనుల ద్వారా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రవీణ్ ప్రకాష్ వెంట జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రఘునాథరెడ్డి, డీఈఓ మీనాక్షి, జిల్లా ఇంటర్మీడియెట్ రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ సురేష్ బాబు, డీవైఈఓ రంగస్వామి, ఎంఈఓ గంగప్ప ఉన్నారు.

ట్యాబ్‌ల వినియోగంలో అలసత్వంపై ఆగ్రహం..

గోరంట్ల/సోమందేపల్లి: ప్రభుత్వం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందజేసిన ట్యాబ్‌ల వినియోగంలో అలసత్వం పనికిరాదని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. బైజూస్ కంటెంట్‌తో కూడిన ఒక్కో ట్యాబ్ కోసం ప్రభుత్వం రూ.30 వేలు వెచ్చించిందని, చిన్నచిన్న కారణాలతో వాటిని ఉపయోగించకపోవడం దుర్మార్గమన్నారు. శనివారం ఆయన ఆర్జేడీ కృష్ణారెడ్డితో కలిసి మండల పరిధిలోని ఖాజాపురం వద్ద గల కస్తూర్బా పాఠశాలను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ట్యాబ్‌లను వినియోగించలేదని గుర్తించి జిల్లా విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కేజీబీవీలో తరగతి గదులతో పాటు హాస్టల్ గదులు, మరుగుదొడ్లలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో ప్రిన్సిపాల్ శిరీషపై మండిపడ్డారు. పాఠశాలలో రెండో విడత 'నాడు– నేడు' కింద రూ.1.3 కోట్లతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం ఆయన సోమందేపల్లిలోని కేజీబీవీని తనిఖీ చేశారు. బోధన తీరుతోపాటు భోజన, వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో సిలబస్‌పై చర్చించారు.

ఫ్యాన్ గాలికి ఎవరూ నిలవరు

- చంద్రబాబు కుట్రతోనే తెరపైకి షర్మిల
- వైఎస్సార్ సీపీకి పట్టం కట్టండి
- 'పురం' అభివృద్ధికి నాది హామీ
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



'సిద్ధం' పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో హిందూపురం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు బోయ శాంతమ్మ, టీఎన్ దీపిక తదితరులు

హిందూపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో జనమంతా జగన్‌వెంట నడుస్తున్నారని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కుమ్మక్కైనా వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గాలి ముందు నిలవలేరని రాష్ట్ర విద్యుత్తు, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన హిందూపురంలో పర్యటించారు. వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్, అసెంబ్లీ సమన్వయకర్తలు బోయ శాంతమ్మ, టీఎన్ దీపికతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూగూరు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో భయపడి పోయిన చంద్రబాబు రాష్ట్రం శ్రీలంక మాదిరిగా ఆర్థిక దివాలా తీస్తుందని గగ్గోలు పెట్టాడన్నారు. కానీ ఇప్పుడు తాను జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఎక్కువ పథకాలు ఇస్తానంటూ దిగజారుడు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలోనూ అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలనూ మోసం చేశాడన్నారు. మోసపూరిత హామీలివ్వడంలో చంద్రబాబును మించిన అవకాశవాది దేశంలోనే ఎవరూ లేరన్నారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చాక ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి మాట నిలుపుకున్నాడన్నారు. ప్రతి సంక్షేమ పథకంలోనూ మహిళలకు పట్టం కడుతూ వారిని మహరాణులను చేశారన్నారు. అలాగే మహిళలకు పదవులిచ్చి పాలనలోనూ భాగస్వామ్యం చేశారన్నారు.

వాళ్లు కాంగ్రెస్ పాడె మోయడానికే ఉన్నారు..

కాంగ్రెస్ పార్టీ అసలు తమకు పోటీనే కాదని, చంద్రబాబు కుట్రలో భాగంగానే షర్మిల ఈ రకంగా వ్యవహరిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. రాష్ట్రం విడిపోవడానికి చంద్రబాబే కారణమని విమర్శించారు. షర్మిలను తాము రాజకీయ శత్రువుగానే భావిస్తున్నామన్నారు. ఆమెను తెరపైకి తీసుకురావడానికి మూల కారకుడు చంద్రబాబు అన్నారు. చచ్చిపోయిన కాంగ్రెస్ పాడె మోయడానికే షర్మిలతో పాటు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, రామచంద్రరావు లాంటివారు ఉన్నారని ఎద్దేవా చేశారు.

'పురం' అభివృద్ధి బాధ్యత నాది..

రానున్న ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలని, అప్పుడు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. హిందూపురం అభివృద్ధి బాధ్యత తానే తీసుకుంటున్నానన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న బాలకృష్ణ పురం అభివృద్ధికి ఇప్పటివరకు చేసిందేమీలేదన్నారు. నమ్మిన ప్రజలకు సేవలందించి పేరు నిలుపుకోవాలనే ఆలోచన కల్గిన నాయకులను ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని, అంతేతప్ప హైదరాబాదులో ఉంటూ ఎప్పుడోకసారి అలా వచ్చి చేతులూపి వెళ్లేపోయే వారిని కాదని అన్నారు. దీనివల్ల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రెడ్డి ఈశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుమతి రెడ్డి, వజ్ర భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబివుల్లా, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫిర్దోస్ ఖలీల్ పాల్గొన్నారు.



సూగూరు సభకు హాజరైన మహిళలు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన షేక్షావలి

గుత్తి రూరల్: లచ్చానుపల్లి గ్రామ శివారులో లింగాల పంపు హౌస్ వద్ద రైల్వే ఉద్యోగి ఎస్. షేక్షావలి శుక్రవారం అర్ధరాత్రి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే వర్గాలు తెలిపిన మేరకు.. గుత్తి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన షేక్షావలి గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఎలక్ట్రికల్ విభాగంలో టెక్నీషియన్-1గా విధులు నిర్వహించేవాడు. విధి నిర్వహణలో భాగంగా లచ్చానుపల్లి గ్రామ శివారులో ఉన్న లింగాల పంప్ హౌస్‌కు శుక్రవారం రాత్రి వెళ్లాడు. గుత్తి రైల్వే జంక్షన్‌కు నీటిని సరఫరా చేసేందుకు మోటార్ ఆన్ చేయగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసేందుకు నిచ్చెన వేసుకొని పైకి ఎక్కాడు. మరమ్మతులు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కిందకు పడ్డాడు. తోటి సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారు గుంతకల్లు నుంచి హుటాహుటిన వైద్య బృందంతో కలసి అక్కడికి చేరుకొన్నారు. తీవ్రంగా గాయపడ్డ షేక్షావలిని చికిత్స కోసం అనంతపురం తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తీసుకెళ్లారు. ఘటనపై గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు విచారణ చేస్తున్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం



వైద్యుల పనితీరుపై ఆరా తీస్తున్న డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి

గుడిబండ/పరిగి: ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. గుడిబండ మండలంలోని గుడిబండ, మోరుబాగల్, పరిగి మండలకేంద్రంలోన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మెడికల్ ఆఫీసర్లు స్వరూపరెడ్డి, సురేష్‌కుమార్, రూబీ, డీసీఎం పల్లానాగరాజు, సీనియర్ సహాయకులు బాబా ఫక్రుద్దీన్, సీహెచ్ఓ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య హితం.. సర్కారు పథం

- విజయవంతంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష-2'
- ఇప్పటికే 170 వైద్య శిబిరాల నిర్వహణ
- 47,473 మందికి వైద్య సేవలు



పుట్టపర్తి మండలం గంగిరెడ్డి పల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

ప్రశాంతి నిలయం: ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో విడత కార్యక్రమం జిల్లావ్యాప్తంగా విజయవంతంగా సాగుతోంది. మొదటి విడతలో లక్షలాది మంది పేదలకు ప్రభుత్వం వైద్య సేవలను అందించింది. ఎంబీబీఎస్ వైద్యులతో పాటు ఒక కంటి వైద్యుడు, ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లోనే కార్పొరేట్ సేవలు అందేలా చర్యలు చేపట్టింది. కార్యక్రమానికి విశేష ఆదరణ దక్కడంతో రెండో విడతకు గత నెల 2న శ్రీకారం చుట్టింది.

పక్కాగా ఏర్పాట్లు..

'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం సజావుగా సాగేలా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో 130, గ్రామీణ ప్రాంతాల్లో 379 మొత్తం 509 శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో, పట్టణ ప్రాంతాల్లో ప్రతి బుధ, గురువారాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు.

సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు..

'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 137, పట్టణ ప్రాంతాల్లో 33 వైద్య శిబిరాలు నిర్వహించారు. 47,473 మందికి వైద్య సేవలు అందించారు. శస్త్ర చికిత్సల కోసం 128 మందిని ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. 9,166 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 3,624 మందికి అద్దాలు పంపిణీ చేశారు. అలాగే, 78 మందికి కంటి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు.

ఉచితంగా 9 రకాల పరీక్షలు, మందులు

శిబిరాల్లో జనరల్ ఫిజీషియన్, డెంటల్, గైనిక్, పీడియాట్రీషియన్ల సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ప్రజలకు ఈసీజీ, బీపీ, షుగర్, హీమోగ్లోబిన్, యూరిన్, ఉమ్ము, డెంగీ, మలేరియా, ఫైలేరియా తదితర 9 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. సమస్యలను బట్టి 175 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నారు.

వ్యయప్రయాసలు తప్పాయి



మాది మారుమూల గ్రామం. గతంలో వైద్యం కోసం పుట్టపర్తికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు జగనన్న చలవతో మా ఊరిలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేదల చెంతకే వైద్య సేవలు తీసుకొచ్చింది లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో గొప్ప లక్ష్యంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. పట్టణాలకు వెళ్లి వైద్య సేవలు పొందాల్సిన వ్యయ ప్రయాసలు తప్పించారు.

– చంద్రకళ, గర్భిణి, దిగువచెర్లోపల్లి, పుట్టపర్తి మండలం

పేదలకు మేలు



చాలా రోజులుగా ఒళ్లు నొప్పులు, నీరసం, తలభారంగా ఉండేది. రెండు రోజుల క్రితం మా ఊరిలో నిర్వహించిన వైద్య శిబిరానికి వెళ్లి వైద్యులతో చూపించుకున్నా. రక్త పరీక్షలు నిర్వహించి చక్కెర వ్యాధి ఉందని నిర్ధారించారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఉచిత వైద్య శిబిరాల వల్ల మాలాంటి పేదలకు ఎంతో మేలు కలుగుతోంది.

– ఆదిలక్ష్మి, గంగిరెడ్డి పల్లి, పుట్టపర్తి మండలం

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు



'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. జూన్ 30 వరకు వైద్య శిబిరాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. శిబిరాల్లో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటున్నారు. ప్రజలు పెద్ద ఎత్తున వైద్య శిబిరాలకు తరలి వచ్చి సేవలు పొందుతున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నాం.

– డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఎంహెచ్ఓ

జనవాక్కు

ఇంటి వద్దనే ధ్రువపత్రాలు పొందా



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకెళ్లి గంటల కొద్దీ నిరీక్షించేవాళ్లం. అత్యవసరమని ప్రాధేయపడినా ఎవరూ పట్టించుకునేవారు కాదు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా మాకు అవసరమైన సర్టిఫికెట్లు ఇంటి వద్దనే పొందాం. రూపాయి కూడా ఖర్చు కాలేదు. దీంతో చేయూత పథకం ద్వారా ప్రభుత్వం నుంచి రూ.18,750 ఆర్థిక సాయం పొందుతున్నా. సీఎం జగన్ మేలును ఎన్నటికీ మర్చిపోము.

– గీతమ్మ, కరిదాసనపల్లి, అగళి మండలం

ప్రతి పథకంలోనూ లబ్ధి



గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక చాలా ఇబ్బంది పడేవాళ్లం. వైఎస్ జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి సిఫారసు లేకుండా అన్ని పథకాల లబ్ధి చేకూరింది. పిల్లలకు అమ్మఒడి వచ్చింది. నా భర్తకు కిడ్నీలో రాళ్లు ఉంటే ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్క రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేశారు. మహిళా సంఘం ద్వారా నాకు రూ.75 వేలు, సున్నా వడ్డీ అందాయి. రైతు భరోసా వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో అన్ని విధాలుగా మేలు జరిగింది. మా కష్టాలు తీర్చిన జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– దేవి, కరిడికొండ, గుత్తి మండలం

రైతు ముంగిటకే సేవలు



గత టీడీపీ ప్రభుత్వంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందక చాలా ఇబ్బందులు పడ్డాం. విత్తనం కోసం జిల్లా కేంద్రానికి ముందురోజే వెళ్లి అక్కడే పడుకునేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్బీకేల ద్వారా మా ఊళ్లోనే నాణ్యమైన విత్తనం, ఎరువులు అందిస్తున్నారు. పంటల సాగులో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ఆర్బీకే సిబ్బంది తెలుసుకుని వెంటనే సలహాలు, సూచనలు ఇస్తున్నారు. విత్తనం మొదలు పంట విక్రయం వరకూ అన్నీ మా ఊళ్లోనే ఆర్బీకేల ద్వారా జరిగిపోతున్నాయి. రైతు కష్టాలను తీర్చిన సీఎం వైఎస్ జగన్‌కే మా మద్దతు.

– చిరుతల నాగేంద్ర, రైతు, రాప్తాడు

మహిళ దారుణహత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) లక్ష్మీనారాయణమ్మ (ఫైల్)

నార్పల: బండరాళ్లతో మోది మహిళను దారుణంగా హతమార్చిన ఘటన మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. బి.పప్పూరు గ్రామానికి చెందిన నెట్టం రంగప్ప భార్య నెట్టం లక్ష్మీనారాయణమ్మ(52)కు పిల్లలు లేరు. భర్త మరణించినప్పటి నుంచి ఆమె ఒంటరిగా జీవనం సాగిస్తోంది. గ్రామంలో సొంత ఇల్లు, మూడెకరాల భూమి ఉన్నా తన పుట్టినిల్లైన బొందలవాడ గ్రామంలో నివసిస్తోంది. ప్రతి నెలా బి.పప్పూరు గ్రామానికి వచ్చి పింఛన్ డబ్బు తీసుకునేది. అందుకోసమే ఈ నెల ఒకటో తేదీన బి.పప్పూరు వచ్చిన ఆమె మళ్లీ కనిపించలేదు. బంధువులు వెతికినా ఫలితం కానరాలేదు. ఈ క్రమంలోనే తన పొలం సమీపంలోని ఓ అరటి తోటలో విగతజీవిగా కనిపించింది. బండరాళ్లతో మోది హతమార్చిన అనంతరం తోటలో గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిన ఆనవాళ్లు కనిపించాయి. డీఎస్పీ వెంకటశివారెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. హంతకులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు.

403 వీఏహెచ్ఏ పోస్టుల ఖాళీ

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్ఏ) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలో 403 పోస్టులు ఖాళీ ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీఏహెచ్ఏ పరీక్షల తరువాత రెండు విడతలుగా 442 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఆ తరువాత ఇప్పటికే పని చేస్తున్న వీఏహెచ్ఏల బదిలీలో 171 మందికి ఉత్తర్వులు ఇచ్చారు. వచ్చేవారం కొత్త పోస్టుల భర్తీ కోసం జిల్లా వ్యాప్తంగా 403 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు ప్రకటించారు. అందులో అత్యధికంగా ఉరవకొండ డివిజన్‌లో 139 పోస్టులు, అనంతపురం డివిజన్‌లో 120, పెనుకొండ డివిజన్‌లో 59, ధర్మవరం డివిజన్‌లో 57, హిందూపురం డివిజన్‌లో 28 పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం భేష్



ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న ప్రతినిధుల బృందం

బత్తలపల్లి: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని జర్మనీ ప్రతినిధుల బృందం సభ్యులు ప్రశంసించారు. సుస్థిర వ్యవసాయానికి ప్రకృతి వ్యవసాయ విధానం చక్కటి మార్గం అవుతుందని అభిప్రాయపడ్డారు. రైతు సాధికార సంస్థ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించి, ఎలా బలోపేతం చేయాలనే అంశంపై జర్మన్ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో పాటు మరో రెండు అంతర్జాతీయ సంస్థలైన కేఎఫ్‌డబ్ల్యూ, జీఐజెడ్ సంస్థల ప్రతినిధులు శనివారం బత్తలపల్లి మండలంలోని రాఘవంపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ ప్రకృతి వ్యవసాయంలో రైతులు అవలంబిస్తున్న 9 సూత్రాలను తెలియజేయడంతో పాటు వాటి ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాల వల్ల రైతులకు ఆర్థికంగా మేలు జరగడమే కాకుండా కుటుంబ ఆరోగ్యం, నేల సంరక్షణ, నీటి పొదుపుతో పాటు పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందని వివరించారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే గోమూత్రం, పేడలో దాగి ఉండే కోట్లాది సూక్ష్మజీవులు రైతులకు, నేలకు, వాతావరణానికి ఎంతో మేలు చేకూర్చుతాయని వివరించారు. ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆర్‌వైఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్‌కుమార్ సమాధానాలు ఇచ్చారు. అనంతరం జీవ ఎరువుల తయారీపై జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు ఏర్పాటు చేసిన డెమో ప్రదర్శనను తిలకించారు. విత్తనశుద్ధితో పాటు ఘన, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని వ్యవసాయ క్షేత్రంలో అధికారులు చేసి చూపించారు. అనంతరం గ్రామంలోని ముత్యాలమ్మ, వెంకటరాముడుల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన విదేశీబృంద సభ్యులు ఈ సరికొత్త విధానంలో ఎలాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయ పంటల మధ్య గల తేడాలను కూడా పరిశీలించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంలో వచ్చే ఆదాయ వ్యయాల గురించి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.

టమాట ఒక్కకోతలోనే రూ.70 వేల ఆదాయం..

ప్రధాన వేరుశనగలో అంతర పంటగా వేసిన టమాట ఒక్క కోతలోనే తనకు రూ.70 వేల ఆదాయం సమకూరిందని రైతు ముత్యాలమ్మ విదేశీ బృందానికి వివరించారు. గత మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం అనుసరిస్తున్నానని, గత ఏడాది చీనీ పంట ద్వారా రూ.5 లక్షలు ఆర్జించినట్లు రైతు వెంకటరాముడు వివరించారు. ఈ ఏడాది మరో రూ.8 లక్షల దాకా వస్తుందనే నమ్మకంతో ఉన్నట్లు తెలిపారు. ఆతర్వాత గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్టు సిబ్బంది, కమ్యూనిటీ కేడర్‌తో, గ్రామైక్య సంఘం ప్రతినిధులు, మహిళా సంఘాల లీడర్లతో ముచ్చటించి ప్రకృతి వ్యవసాయ కార్యక్రమ అమలులో మహిళల పాత్ర, ప్రకృతి వ్యవసాయంపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఎంజెడ్ (ఫెడరల్ మినిస్టరీ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్, ఏ జెర్మన్ కంపెనీ) సీనియర్ పాలసీ అడ్వైజర్ క్రిస్టోఫ్ వాన్ స్టెచోతో పాటు సీనియర్ పాలసీ ఆఫీసర్ అలెగ్జాండర్ లింగెంతాల్ల, కేఎఫ్‌డబ్ల్యూ కంట్రీ మేనేజర్ జోష్కా గ్రేవ్, సీనియర్ సెక్టార్ స్పెషలిస్టు సంగీత అగర్వాల్, ఎన్విరాన్మెంట్, క్లైమేట్ చేంజ్ అండ్ బయోడైవర్సిటీ విభాగం క్లస్టర్ కోఆర్డినేటర్ మొహమ్మద్ ఎల్ ఖవాద్, జీఐజెడ్ న్యాచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, అగ్రో ఎకాలజీ డైరెక్టర్ రాజీవ్ అహల్, ప్రాజెక్టు హెడ్ ఫర్ అగ్రో ఏకాలజీ ట్రన్స్ఫర్మేషన్ ప్రాసెస్ యూటీ రిక్మాన్, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాయి పిలుపు.. 'మేలుకొలుపు'



నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రశాంతి నిలయం: ఉమ్మడి కరీంనగర్ జిల్లా సత్యసాయి భక్తులు 'మేలుకొలుపు' పేరుతో నిర్వహించిన నృత్య రూపకం భక్తులను మురిపించింది. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన భక్తులు శనివారం సాయికుల్వంత్ సభా మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి బాబా ప్రవేశపెట్టిన బాలవికాస్ విద్యా విధానం బాల్యం నుంచే ఎలా సద్గుణాలను అలవర్చుతుందో వివరిస్తూ చిన్నారులు చక్కగా వివరించారు. సుమారు 2 వేల మంది భక్తులు సత్యసాయి మహాసమాధి చెంత సామూహిక గాయత్రి జపం నిర్వహించారు. సంగీత కచేరీ చేపట్టారు.



నాటికలో ఓ ఘట్టం

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



విజేతలకు పంపిణీ చేసేందుకు ప్రదర్శనగా ఉంచిన ట్రోఫీలు

- రాష్ట్రస్థాయి పోటీలకు 120 మంది ఎంపిక

పుట్టపర్తి అర్బన్: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా ముగిసిందని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి సమీపంలోని ప్రశాంతిగ్రామం వద్ద ఉన్న వై జంక్షన్‌లో ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిసెంబర్ 15న ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో సుమారు 680 మంది గ్రామీణ క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. సచివాలయ, మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారన్నారు. ఈ నెల 9 నుంచి 16 వరకూ విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి 120 మంది ఎంపికయ్యారన్నారు. అక్కడ కూడా సత్తా చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా పోటీలను నిర్వహించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి రూ.60 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు ప్రకటించారు. అనంతరం క్రీడాకారులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్, ఆర్డీఓ భాగ్యరేఖ, పీడీలు వెంకటేషు, సూర్యనారాయణ, రామక్రిష్ణ, ప్రభాకర్, నాగరాజు, చంద్ర, ఓబులేషు, రమేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు సాధించిన జట్లు:

పురుషుల విభాగంలో..

క్రికెట్‌లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా హిందూపురం, మడకశిర, కదిరి జట్లు నిలిచాయి. కబడ్డీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పుట్టపర్తి, మడకశిర, హిందూపురం, వాలీబాల్‌లో పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలువగా, ఖోఖోలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పెనుకొండ, హిందూపురం, ధర్మవరం జట్లు, బ్యాడ్మింటన్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ధర్మవరం, హిందూపురం, పుట్టపర్తి సాధించాయి.

మహిళల జట్లు వివరాలు..

క్రికెట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మడకశిర, హిందూపురం, పెనుకొండ జట్లు ఉన్నాయి. కబడ్డీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి, ఖోఖోలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి, వాలీబాల్ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో హిందూపురం, మడకశిర, పుట్టపర్తి, బ్యాడ్మింటన్ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మడకశిర, హిందూపురం, పెనుకొండ జట్లు నిలిచాయి.